కేతకీలో ఎంపీ ప్రత్యేక పూజలు

ఝరాసంగం, ఫిబ్రవరి 26 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అర్చకులు రాజగోపురం ఎదుట ఎంపీకి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఎంపీని పూలమాల శాలువాతో సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

కేతకీలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ బీబీ పాటిల్ దంపతులు

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

కోహీర్, ఫిబ్రవరి 26: కోహీర్(ఓంకార పట్టణం)లోని విశ్వేశ్వరాలయంలో దేవాతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయ గర్భగుడిలో శివలింగం, నందీశ్వరుడు, గణపతి, నాగదేవత, భద్రకాళి, వీరభద్రేశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలను ప్రారంభించా రు. తర్వాత గోప్రదక్షిణలు చేయించారు. వే డుకలను పురస్కరించుకొని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో ఆలయ నిర్మాత శరత్, లింగాల సంగమేశ్వర్, బస్వరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్‌పాటిల్, శ్రీనివాస్, శరణప్ప పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న ఎంపీ బీబీ పాటిల్

రాష్ట్రస్థాయి పోటీల్లో మెరిసిన విద్యార్థులు

బొల్లారం, ఫిబ్రవరి 26: నగరానికి చెందిన అక్షర కౌముది సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మల్కాజిగిరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బహుమతులు సాధించినట్లు పాఠశాల తెలుగు గైడ్ ఉపాధ్యాయుడు అడ్డాడ శ్రీనివా సరావు సోమవారం తెలిపారు. పాటల పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని జెస్సీ ప్రథమ, ఉపన్యాస పోటీల్లో 8వ తరగతి విద్యార్థి కార్తీక్ గౌడ్ ద్వితీయ స్థానల్లో నిలిచి బహుమతుల తోపాటు ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ సాధించిన విద్యార్థులను హెచ్ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

న్యాల్‌కల్, ఫిబ్రవరి 26: మండల కేంద్రమైన న్యాల్‌కల్ శ్రీవాణి విద్యాలయంలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈవోగా విద్యార్థిని విశ్వతేజ, ఎంఈవోగా కార్తీక్, హెచ్ఎంగా అబ్దుల్ రాజక్, ఉపాధ్యాయులుగా శ్రీభాను, అశ్విని, భాగ్యవంతి, మమత, భూమిక, హరిక, సురేశ్, వంశి, శ్రావణి, మహేశ్ తదితరులు వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్ఎం శివకుమార్ అభినందించి, బహుమతులు అందించారు.

స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

డివిజన్ అభివృద్ధిలో రాజీపడం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 26 : ఆర్సీపురం డివిజన్‌ను అభివృద్ధిలో తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని వాసవీనగర్‌కాలనీలో రూ.23లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి విషయంలో రాజీపడకుండా పనులు చేస్తామన్నారు. అన్ని కాలనీలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. నిత్యం ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. డివిజన్ ప్రజలకు రోజూ అందుబాటులో ఉంటామన్నారు.

వాసవీనగర్ కాలనీవాసుల కోరిక మేరకు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మురళి, మల్లికార్జున్, నర్సింలు, నాగరాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

అండర్‌పాస్ పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం, ఫిబ్రవరి 26: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి రైల్వేస్టేషన్‌కు సంబంధించి అండర్‌పాస్ రోడ్డు పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరు చేసింది. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా అండర్‌పాస్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని రైల్వే అధికారులు ఈదులనాగులపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేయడంతో రైల్వే ఉన్నతాధికారులతోపాటు మున్సిపాల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్ శంషాబాద్ రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి హాజరై శంకుస్థాపనకు సంబంధించిన శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైల్వే నోడల్ అధికారి రామాంజనేయరావు, స్టేషన్ మాస్టర్ బుచ్చిరెడ్డి, సీఐ రవేందర్‌రెడ్డి, మున్సిపాల్ కమిషనర్ సంగారెడ్డి, స్టేషన్ రైల్వేబోర్డు సభ్యులు మహేందర్, గౌస్, రాంబాబుగౌడ్, రాజిరెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఎల్ఈడీలో వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు

కబ్జాలో 'దొంగసరాని కుంట'

- కుంట ఆనవాలు లేకుండా కట్ట ధ్వంసం
- ఆరేండ్లైనా పునర్నిర్మాణానికి నోచుకోని వైనం
- ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమించి రోడ్డు నిర్మాణం
- మత్స్యకారులు, రైతుల ఫిర్యాదులకు తలొగ్గని అక్రమార్కులు
- పోలీసులకు ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు

కుంటను పూడ్చి, కట్టను ధ్వంసం చేయడంతో ఆనవాలు కోల్పోయిన దొంగసరాని కుంట

జిన్నారం, ఫిబ్రవరి 26 : మండలంలోని ఊట్ల దొంగసరాని కుంటను కొందరు వ్యక్తులు ధ్వంసం చేసి కట్ట ఆనవాలు లేకుండా చేశారు. ఇది జరిగి దాదాపు ఆరేండ్లవుతున్నది. ఊట్ల శివారులోని సర్వే నంబర్ 612లో 3.31ఎకరాల్లో ఉన్న ఈ కుంటలో ఏకపసల్ పంటలు సాగు చేసుకోవాలి. అంటే కుంట శిఖంలో భూమి తేలితేనే సాగు చేసుకోవాలని నిబంధనలు ఉన్నాయి. కుంటను మట్టితో నింపకూడదు. అయితే కొందరు అక్రమార్కులు కుంటను పూడ్చి, కట్టను ధ్వంసం చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ రికార్డుల్లో 3.31 ఎకరాల్లో కుంట ఉన్నట్లు స్పష్టంగా ఉన్నది. ఈ విషయంపై రైతులు, మత్స్యకారులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు అప్పట్లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై రెండు శాఖల అధికారులు జాయింట్ సర్వే చేసి కుంట హద్దులు నిర్ధారించి ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేశారు. కుంటను ధ్వంసం చేసిన వ్యక్తులపై ఇరిగేషన్ అధికారులు జిన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. దీంతో తొలిగించిన కట్టను యథావిధిగా పునర్నిర్మిస్తామని సదరు వ్యక్తులు అధికారులకు, రైతులు, మత్స్యకారులకు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనలు సద్దుమనిగి ఆరేండ్లు గడుస్తున్నది. అయినా ఇప్పటికీ కుంట కట్ట పునర్నిర్మాణం జరగలేదు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన రోడ్డు

కట్ట పునర్మాణాన్ని అడ్డుకున్న కారకులు

నాలుగేండ్ల క్రితం ఉపాధి హామీ కూలీలు కుంట కట్ట పునర్నిర్మాణం చేపట్టగా సదరు వ్యక్తులు అడ్డుకొని హంగామా సృష్టించారు. ఈ సమస్యను అదే సమయంలో సర్పంచ్ ఆంజనేయులు మండల సభలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దొంగసరాని కుంటను తిరిగి పునర్నిర్మించాలని రైతులు, మత్స్యకారులు అధికారులను కోరుతూనే ఉన్నా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు.

ఆక్రమణ.. ఆపై రోడ్డు నిర్మాణం

దొంగసరాని కుంటకు సమీపంలో ఏర్పాటు చేసిన ఫామ్ ల్యాండ్‌లోకి వెళ్లేందుకు సర్వే నంబర్ 1002 ప్రభుత్వ భూమిని ఆక్రమించి కొంతమేర రోడ్డు వేశారు. ఫామ్ ల్యాండ్‌లోకి వెళ్లేందుకు బెదిరించి మరీ అసైన్డ్ భూమిలో నుంచి రోడ్డు వేశారని ఊట్ల గ్రామ రైతులు ఆరోపించారు. ఇటీవల జిన్నారం ఆ రోడ్డుకు అడ్డంగా కందకం తీశారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించి వేసిన రోడ్డును తొలిగించాలని ఊట్ల గ్రామ రైతులు, మత్స్యకారులు కోరుతున్నారు. దొంగసరాని కుంట ను యథావిధిగా ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

దొంగసరాని కుంటను పూడ్చి, కట్టను ధ్వంసం చేసి పూర్తిగా చదును చేయడంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులం జాయింట్ సర్వే చేశాం. కుంట ధ్వంసం చేయడంపై అప్పుడే జిన్నారం పోలీసులకు ఫిర్యాదు చేశాం. కుంట కట్టను యథావిధిగా రీస్టోర్ చేస్తామని ధ్వంసం చేసిన వారు చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. దీనిపై లీగల్ యాక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది.

– దిలీప్, ఇరిగేషన్ ఏఈ, జిన్నారం

ఆరేండ్లైనా చర్యలేవి?

దొంగసరాని కుంట ఆనవాలు లేకుండా ధ్వంసం చేసిన వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. లేదంటే కుంటను చెడగొట్టిన వారితోనే మళ్లీ కుంటను పునరుద్ధరించి కట్టను పోయించాలి. కుంటను ధ్వంసం చేసి దాదాపు ఆరేండ్లవుతున్నది. దీనిపై ఇప్పటివరకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? దీనిపై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాం.

– నీలం శ్రీలత, నియోజకవర్గ ఫిషరీస్ సొసైటీ అధ్యక్షురాలు, జిన్నారం

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- పరీక్ష రాయనున్న 36,153 మంది విద్యార్థులు
- 52 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 26: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 16 వరకు జరిగే పరీక్షలకు ఆయా శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 36,153 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 17,665 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు కాగా, 18,488 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనున్నది. 52 మంది చీఫ్ సూపరింటుండెంట్లు, 52 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ కమిటీలను ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారు. పరీక్షల నిర్వహణపై విద్య, వైద్య, రెవెన్యూ, విద్యుత్, పోలీస్, ఆర్టీసీ, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇప్పటికే కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పోలీసు స్టేషన్లలో భద్రపరుస్తున్న ప్రశ్న పత్రాలను కేంద్రాలకు తరలించేందుకు అవసరమైన బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాల దగ్గర్లో జిరాక్స్ కేంద్రాలను మూసివేయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద థర్మల్ స్కానర్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచుతున్నారు. వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రశాంతంగా పరీక్ష రాయాలి

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల కు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు నిర్భయంగా పరీక్ష రాయాలి. గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉం డదు. ఒక వేళ ప్రైవేటు కళాశాల విద్యార్థుల కు హాల్‌టికెట్ లభించని పక్షంలో tsbie.cgg.gov.inవెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. వేసవి దృష్ట్యా మంచినీరు, వైద్య, రవాణాకు సంబంధించి ప్రత్యేక సూచనలు చేశాం. ఎలాంటి అవాంఛనీయ ఘట నలు జరుగకుండా ఏర్పాట్లు చేశాం. అన్ని ప్రాం తాల విద్యార్థులకు వీలుగా ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు.

- గోవింద్ రామ్, సంగారెడ్డి ఇంటర్మీడియట్ అధికారి

పోటీ పరీక్షలకు శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 26: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ఐదు నెలల ఉచిత శిక్షణ అందించనున్నట్టు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేశ్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో ఎంపికైన నిరుద్యోగ అభ్యర్థులకు మార్చి 18నుంచి ఆగస్టు 17వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని, అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకూడదన్నారు. గతంలో స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మార్చి 6లోగా www.tsstudycircle.co.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మార్చి 10న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు అర్హత పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 9849990701లో సంప్రదించాలని సూచించారు.

నక్ష బాట ప్రహరీ కూల్చివేత

హత్నూర, ఫిబ్రవరి 26: నక్ష బాటను కబ్జా చేసి ఏర్పాటు చేసిన సిమెంట్ పలకలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. హత్నూర మండలం కాసాల శివారులో నక్ష బాటకు అడ్డంగా వేసిన సిమెంటు పలకలపై ఈనెల 16న నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఫర్వీన్ షేక్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శీను, సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంటు పలకలను కూల్చివేయించిన రెవెన్యూ అధికారులు

బీజేపీ జిల్లా అధ్యక్షురాలిని కలిసిన మండల కమిటీ

జిన్నారం, ఫిబ్రవరి 26: నూతనంగా ఎన్నికైన బీజేపీ జిన్నారం మండల కమిటీ సభ్యులు సోమవారం జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ జిన్నారం మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు రామచంద్రాపురంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ప్రజావాణికి పోటెత్తిన ఫిర్యాదులు

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు ఫిర్యాదులను అందజేసి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రజావాణిలో మొత్తం 70 అర్జీలు రాగా, 20 రెవెన్యూ శాఖకు సంబంధించినవి, మిగతా 50 వివిధ శాఖలకు సంబంధించి ఉన్నాయి. ఆయా దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్ వాటిని సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలంటే అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ పథకాలకు కావాల్సిన అర్హతలను బట్టి వారికి మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీకి సన్మానం

జిన్నారం, ఫిబ్రవరి 26 : జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. సోమవారం జరగాల్సిన ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు సంతోషంతో సంబురాలు జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ ఆధ్వర్యంలో జిన్నారం ఎంపీటీసీ–1 లావణ్యానరేశ్, గడ్డపోతారం ఎంపీటీసీ జనాబాయి, సోలక్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, ఊట్ల ఉపసర్పంచ్ రవీందర్, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఎంపీపీని కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నరేశ్, నర్సింగ్‌రావు, దేవేందర్, మహేందర్‌రెడ్డి, వడ్ల శ్రీనివాస్, విష్ణుమూర్తి ఉన్నారు.

ఎంపీపీ రవీందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

తోడు దొంగలు అరెస్ట్

- 10 తులాల బంగారం, 2.5కిలోల వెండి, రెండు బైక్‌లు, 20 అమెరికన్ డాలర్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేశ్

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, ఫిబ్రవరి 26 : చైన్ స్నాచింగ్, ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలు, బైక్‌లు ఎత్తుకెళ్తున్న తోడు దొంగలను అమీన్‌పూర్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. దీనికి సం బంధించిన వివరాలను సోమవారం వెల్లడించారు. వరుస దొంగతనాలు చేస్తున్న ఇద్దరు నిందితుల నుంచి 10 తులాల బంగారం, 2.5కిలోల వెండి, రూ.25వేల నగదుతోపాటు 20 అమెరికన్ డాలర్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ మొత్తం రూ.11.5లక్షలు ఉంటాయని చెప్పారు. సోమవారం ఉదయం అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో అమీన్‌పూర్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వాహనాల తనిఖీలో భాగంగా బైక్‌పై వస్తున్న ఇద్దరు అనుమానిత వ్యక్తులను పట్టుకొని విచారించారు.

ఒకరు హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లోని గణేశ్‌నగర్ వాసి మున్నితం అమ్రాజ్‌కుమార్ అలియాస్ అమర్ రాజ్‌కుమార్‌రెడ్డి, మరొకరు చంద్రాయణగుట్ట, రుమాన్ హోటల్ దగ్గర కుమ్మరివాడకు చెందిన వ్యక్తి తిప్పబోయిన సాయికిరణ్ అలియాస్ సాయిగా గుర్తించారు. ఇద్దరు కలిసి అమీన్‌పూర్ ఏరియాలో మూడు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని చెప్పారు. 12 ఏండ్లుగా మద్యం, గంజాయికి బానిసలై జల్సాలకు అలవాటుపడ్డారని, చైన్‌స్నాచింగ్, దొంగతనాలు, బైక్‌లను ఎత్తుకెళ్తూ జల్సాలు చేస్తుంటారని పేర్కొన్నారు. ఇద్దరు కలిసి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సుమారు 40 దొంగతనాలు చేశారని, వీరిపై పలు కేసులు ఉన్నాయని, గతంలో పలుమార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చారన్నారు.

కేసు ఛేదించిన పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ రాగరాజు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివలింగం, మహేశ్‌గౌడ్ సిబ్బందిని అభినందించారు.

రాజనెల్లిలో బైపాస్ ప్రారంభం

కోహీర్, ఫిబ్రవరి 26: మండలంలోని రాజనెల్లి, పీచేర్యాగడి గ్రామాల మధ్యనున్న రైల్వే అండర్ బైపాస్‌ను సోమవారం బీదర్ రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు ప్రారంభించారు. రైలు పట్టాల కింది నుంచి రోడ్డును ఏర్పాటు చేయడంతో వాహనదారుల ఇబ్బందులు తీరుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్, శ్రీనివాస్‌గౌడ్, రైల్వే పాల్గొన్నారు.

ఆర్థికంగా స్థిరపడాలి

కోహీర్, ఫిబ్రవరి 26: తమకు నచ్చిన అంశంలో శిక్షణ పొంది జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలని ఎస్‌వీఈపీ నారాయణఖేడ్ ఐకేపీ ఏపీఎం, ఆర్ఎస్ఆర్పీ విశ్వేశ్వర్‌గౌడ్ ఆకాంక్షించారు. సోమవారం కోహీర్‌లోని ఎంపీపీ సమావేశ మందిరంలో ఆయా గ్రామల వీవోఏలకు లక్‌పతి దీదీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరినీ లక్షాధికారిగా తయారు చేయడమే పథకం లక్ష్యమన్నారు. ఆసక్తి ఉన్న వీవోఏలు ముందుకు రావాలని కోరారు. ఏపీఎం సమ్మయ్య, వీవోఏలు పాల్గొన్నారు.

ఇద్దరికి ఐదేండ్ల జైలు

సంగారెడ్డి, ఫిబ్రవరి 26: హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు ఐదేండ్లు జైలు శిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్ తీర్పు వెలువరించారు. సోమవారం కేసుకు సంబంధించిన పూర్వాపరాలను విన్న న్యాయమూర్తి ఈమేరకు తీర్పునిచ్చారు. 2 జూలై 2017లో బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్‌లో వెలిమెల గ్రామానికి చెందిన అశంగారి రాజు, అశంగారి మహేశ్ హత్యాయత్నం చేశారని అదే గ్రామానికి చెందిన అశంగారి లక్ష్మయ్య ఫిర్యాదు చేశాడు. తన ఇంటి పక్కన ఖాళీస్థలంలో రేకుల షెడ్డు వేస్తున్నావని నిందితులు దుర్భాషలాడుతూ రాడ్‌తో లక్ష్మయ్య తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. తనను ఉద్దేశపూర్వకంగా చంపాలని దాడికి యత్నించారని, చట్టరీత్య చర్యలు తీసుకోవాలని లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌హెచ్ ఓ వెంకట్‌రెడ్డి, బీడీఎల్ భానూర్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా కేసు పూర్వాపరాలను విన్న న్యాయమూర్తి నిందితులిద్దరికీ ఐదేండ్ల జైలుశిక్ష విధించారు. ఒక్కొక్కరికీ రూ. 1,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన అధికారులు పి.వెంకట్‌రెడ్డి, ఎస్ఐ, ప్రస్తుత స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి, పీపీ అనంతరావు కులకర్ణి, కోర్టు డ్యూటీ అధికారి రఫిక్, కోర్ట్ లైజనింగ్ అధికారులు రాజశేఖర్, సత్యనారాయణలను ఎస్పీ అభినందించారు.

అభినందనీయం

సంగారెడ్డి, ఫిబ్రవరి 26: జీఓ 317ను సవరించేందుకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో సంఘం డైరీ, క్యాలెండర్‌ను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావీద్ అలీతో కలిసి ఆవిష్కరించారు. ఉద్యోగుల ఇండ్ల స్థలాలకు 30 ఎకరాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నిర్మలారెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి రవి, నాయకులు సత్యనారాయణగౌడ్, నరేందర్, రాజకుమార్, కసిని శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, గౌస్ హష్మీ, మహేశ్, నిర్మల, రాజకుమారి, సుధామణి, మమత, భాస్కర్, విజయ్‌కుమార్ షకీల్, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఉండాలి

అమీన్‌పూర్, ఫిబ్రవరి 26: ప్రతి వ్యక్తి వ్యక్తిత్వాన్ని సక్రమంగా రూపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీపీ డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు నూతనంగా ఎంపికైన ఎస్‌సీటీసీటీ కానిస్టేబుల్స్ బేసిక్ ఇండక్షన్ ట్రెయినింగ్ కార్యక్రమాన్ని సోమవారం అమీన్‌పూర్ టీఎస్‌పీఎఫ్ అకాడమీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారికి అభినందనలు తెలిపారు. 9నెలల పాటు శిక్షణ ఉంటుందని, వృత్తిపరమైన శిక్షణతోపాటు వ్యక్తిగత విలువలను నేర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఐజీ అకాడమి ప్రిన్సిపాల్ మాధవరావు, కమాండెంట్ త్రినాథ్ ఉన్నారు.

మాట్లాడుతున్న డీజీపీ అనిల్ కుమార్